క్లుప్తంగా

విచ్ఛిన్న పాపం బీఆర్ఎస్‌దే!

చేర్యాల ప్రాంతంపై మాజీ జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): జిల్లా విభజనల్లో చేర్యాల ప్రాంతాన్ని విచ్ఛిన్నం చేసిన పాపం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి విమర్శించారు. దూళ్మిట్ట మండల అధ్యక్షుడు కోల సాయిలు ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ...చేర్యాల అస్తిత్వాన్ని విచ్ఛిన్నం చేసిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రెవెన్యూ డివిజన్ కోసం ధర్నాలు చేయడం సిగ్గు చేటన్నారు. గత పదేళ్ల అధికారంలో ఉండి రెవెన్యూ డివిజన్ ఇవ్వడం చేతకాక ఇప్పుడు కాకమ్మ కథలు చెబుతుంటే ఈ ప్రాంత ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా చేసి తీరుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గద్దల మహేందర్, మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు చల్లా లతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గంగధార్, గ్రామశాఖ అధ్యక్షుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ



గజ్వేల్‌లో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: చాకలి ఐలమ్మ తెలంగాణ వీరనారి అని, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పేర్కొన్నారు. పట్టణంలోని పాండవుల చెరువు సమీపంలోని మడేలయ్య గుడివద్ద బైపాస్ రోడ్డు మార్గంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చాకలి ఐలమ్మను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంగారి శ్రీధర్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుబాయి ఐసీటీకి సిద్దిపేట విద్యార్థి



లక్ష్మీకాంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దుబాయి ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్ (ఐసీటీ)కు సిద్దిపేట మెరీడియన్ విద్యార్థి లక్ష్మీకాంత్ ఎంపికయ్యాడు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

ముగిసిన ముర్షద్ గడ్డ ఉత్సవాలు



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ముర్షద్‌గడ్డ ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం నుంచే దర్గా వద్ద ఖురాన్ పఠనం, జ్ఞాన అమృత కవాలి, భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, దర్గా నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మల్లన్న నిత్యాన్నదానానికి విరాళం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కొనసాగుతున్న శాశ్వత నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు కుమారస్వామి,పద్మ దంపతులు రూ1,00,116లను విరాళమిచ్చారు. ఈ మేరకు నగదును ఆలయ ఈవో రామాంజనేయులుకు శుక్రవారం అందజేశారు.

పకోడి.. బిస్కెట్లు.. చిరుధాన్యాలు

- నేటి నుంచి టెన్త్ విద్యార్థులకు అల్పాహారం
- 15 పాఠశాలలు 447 మంది..
- శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా...
- రెండు పూటలా అదనపు తరగతులు



కోహెడ హైస్కూల్‌లో అదనపు తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కోహెడ(హుస్నాబాద్): పదోతరగతిలో శత శాతమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణతోపాటు శనివారం నుంచి అల్పాహారం అందించనుంది. ప్రతీ విద్యార్థికి ఉడకబెట్టిన చిరుధాన్యాలు, ఉల్లిగడ్డ పకోడి, బిస్కెట్లను అల్పాహారంగా ఇవ్వనుంది. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.15 ఖర్చు పెట్టనుంది. ఇక ప్రత్యేక తరగతుల నిర్వహణలో భాగంగా పాఠశాల ప్రారంభానికి ముందు ఒక గంట, పూర్తయ్యాక ఒక గంట పాటు ప్రత్యేక విద్యార్థులకు క్లాసులు చెబుతున్నారు. గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థుల పట్ల టీచర్లు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

15 పాఠశాలలు.. 447 మంది విద్యార్థులు..

మండలంలో 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 263 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో బాలికలు 121, బాలురు 142 ఉన్నారు. అలాగే తంగళ్లపల్లి కస్తూర్బాగాంధీ బాలిక పాఠశాల, నాగ సముద్రాల మోడల్ స్కూల్, కోహెడ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలురు) పాఠశాలలో 184 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 69 బాలికలు. 115 బాలురు ఉన్నారు. మొత్తం 15 పాఠశాలల్లో 447 మంది (257 బాలురు, 190 బాలికలు) విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

నగదు, కానుకలతో ప్రోత్సాహం

పదో తరగతిలో 10 జీపీఏ, ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురి విద్యార్థులకు కోహెడ ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, మాజీ సర్పంచ్ నవ్య నగదు రూ.5వేలు అందించారు. శాలువాలతో సత్కరించారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులకు సైకిళ్లను అందించారు. ఈ ఏడాది సైతం కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, బహుమతులు అందించేందుకు ముందుకొస్తున్నాయి.

ఇష్టంగా చదువుతున్న



ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ప్రతీ పాఠ్యాంశాన్ని ఇష్టంగా చదువుతున్న. ప్రతీ సబ్జెక్టులో ఎక్కువ మార్కులు వచ్చేలా సిద్ధమవుతున్న. టీచర్ల ప్రోత్సాహం బాగుంది. మంచి మార్కులతో పాఠశాలకు..తల్లిదండ్రులకు పేరు తెస్తా.

– పేర్యాల శ్రీహర్షిణి,
10 తరగతి విద్యార్థి, హైస్కుల్ కోహెడ

ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులపై ప్రత్యేక బోధన



మా పాఠశాలలో ఎస్సెస్సీలో 58 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంగ్లిష్, మ్యాక్స్ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నం. సిలబస్ అంతటిపై అవగాహన కల్పిస్తున్నం.

– మహమూద్,
హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, కోహెడ.

టాప్–1లో నిలిపేందుకే...



ఎస్సెస్సీలో శత శాతం ఉత్తీర్ణత దిశగా..మండలాన్ని జిల్లాలో టాప్–1లో నిలుపుటకు ప్రత్యేక కృషి చేస్తున్నం. సబ్జెక్టుల వారీగా అదనపు తరగతులు పెట్టి ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శద్ధ తీసుకుంటున్నాం. గ్రామ పెద్దల ప్రోత్సాహంతోపాటు ప్రత్యేక తరగతుల నిర్వహణలో ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎక్కువగా ఉంది.

– పద్మయ్య, ఇన్‌చార్జి,
ఎంఈవో కోహెడ

ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలేవీ?



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సాంబరాజు

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సాంబరాజు నిలదీత
- పనికి రూ.70 దాటడం లేదని కూలీల ఆవేదన

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీలకు నీడ, కనీసం సౌకర్యాలు లేకపోవడం పట్ల బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు మండిపడ్డారు. అక్కన్నపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కేజీబీవీ పాఠశాల వెనుకభాగంలో ఓ రైతు వ్యవసాయ పొలంలో మట్టి తవ్వకాలు పనులు చేస్తున్న కూలీల పని ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఉపాధి హామీ ఏపీవో ప్రభాకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పని ప్రదేశంలో కనీసం తాగునీటి సౌకర్యాన్ని కూడా కల్పించకపోతే ఎలా అని నిలదీశారు. తమకు కనీసం రూ.70 కూలి కూడా దాటడం లేదని, ఆరువారాలుగా డబ్బులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అటవీ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన



రాజీవ్‌రహదారిపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ములుగు(గజ్వేల్): రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల పరిశోధన కేంద్రం(ఎఫ్‌సీఆర్ఐ)లోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాజీవ్‌రహదారిపై వెళ్లే వాహనాలను ఆపి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు, వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టులను ధరించాలని, మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని ప్ల కార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.ఎస్ శ్రీనిధి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు



గద్దర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ప్రజా గాయకుడు, ప్రజాయుద్ధనౌక గద్దర్ 77వ జయంతి వేడుకలను శుక్రవారం పట్టణ కేంద్రంలో జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారుడిగా గద్దర్ తన జీవితాన్ని మొత్తం ఆటపాటకు అంకితం చేశారన్నారు. దేశంలోని అన్ని వర్గాల అన్ని రంగాల ప్రజల కోసం పాడిన వ్యక్తి ఆయనని, కళా సాంస్కృతిక రంగాలకు గద్దర్ చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. కార్యక్రమంలో చేర్యాల డివిజన్ అధ్యక్షుడు చింతల విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు పుట్ట రాజు, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చంద్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ శిఖరం గద్దర్

హుస్నాబాద్: బూర్జువా, భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాలపై పోరాటానికి ప్రజలను చైతన్యం చేసిన ప్రజాగాయకుడు గద్దర్ ఓ ఉద్యమ శిఖరమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అభివర్ణించారు. గద్దర్ 77వ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో జేఏసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ...బడుగు వర్గాల కోసం గద్దర్ నిరంతరం తపన పడిన ఉద్యమకారున్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ చందు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్‌లో తాగు నీరు సమస్యను పరిష్కారానికి ఇంటింటి సర్వే చేపట్టి సమస్యలను గుర్తించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రుకుసీనా పేర్కొన్నారు. హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందుగానే సమస్యలను గుర్తించాలని సూచించారు. 10 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో రమేశ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపడతాం

మద్దూరు(హుస్నాబాద్): వేసవిలో గ్రామాల్లో తాగు నీటి సమస్యలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రామ్మోహన్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో రామ్మోహన్ మాట్లాడుతూ... ముందస్తుగా నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. నీటి సమస్యలపై ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి, జిల్లా స్థాయి అధికారులకు తెలుపాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు కృష్ణ, ప్రవల్లిక, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల పక్షాన పోరాడుతా

ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి రవీందర్

హుస్నాబాద్: నిరుద్యోగులకు నెలకు రూ.10వేల జీవన భృతి కల్పించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి దేవుని రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో న్యాయవాదులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఒక్క అవకాశం ఇస్తే శాసన మండలిలో నిరుద్యోగుల గొంతుక వినిపిస్తానన్నారు. ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానన్నారు. సమావేశంలో న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, కన్నోజు రామకృష్ణ, కొత్తపెల్లి దేవేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలంటే వణుకెందుకు?: వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుడుతోందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతుండగా, స్థానిక ఎన్నికలకు వెళితే ఓటమి తప్పదని భావించి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాలు, పట్టణాల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: మైనార్టీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని టీఎంఆర్ఈఐఎస్ జిల్లా ప్రాంతీయ సమన్వయాధికారి సుధారాణి, మైనార్టీ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 విద్యాసంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ (ఎంపీసీ, బైపీసీ)లలో 60 మైనార్టీ, 20 నాన్ మైనార్టీ సీట్లతో పాటు 6, 7, 8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 28లోపు తమ సంస్థ వెబ్‌సైట్లో లేదా నేరుగా పాఠశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

బీఎస్పీ నాయకుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్

హుస్నాబాద్: ఇందిరమ్మ ఇండ్లను నిరుపేదలైన అర్హులకే మంజూరు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అధికారులను కోరారు. పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ...డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఉన్నవారికి కూడా ఇందిరమ్మ ఇళ్లను అధికారులు మంజూరు చేశారన్నారు. దరఖాస్తులపై విచారణ జరిపి అర్హత ఉన్నవారికే ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సీఐని అభినందించిన సీపీ అనురాధ



శ్రీటౌన్ సీఐ విద్యాసాగర్, పీపీ వెంకటలింగంను అభినందిస్తున్న సీపీ అనురాధ



ఎస్సై రవీందర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పోక్సో కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కీలకపాత్ర వహించిన సీఐ విద్యాసాగర్, పోలీసు అధికారులను సీపీ అనురాధ శుక్రవారం అభినందించారు. అదేవిధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటలింగం, కోర్టు మానిటర్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, కోర్టు కానిస్టేబుళ్లు ప్రవంతి, స్వామి ఇతర సిబ్బందిని కూడా ఆమె ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

గజ ఈతగాళ్లకు నగదు పురస్కారం

కొండ పోచమ్మ సాగర్‌లో మునిగి చనిపోయిన వారి మృతదేహాలను బయటకు తీసుకొచ్చిన గజ ఈతగాళ్లు యాదగిరి, కృష్ణ, రాజేందర్, నాగరాజు, మహేశ్, రాజులను సీపీ అనురాధ అభినందించి, నగదు పురస్కారం అందజేశారు.

రిటైర్‌మెంట్ వృత్తికే..వ్యక్తిత్వానికి కాదు

సిద్దిపేటకమాన్: పోలీసు రిటైర్‌మెంట్ కేవలం వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదని సీపీ అనురాధ పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన ఎస్సై రవీందర్‌ను పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధ శుక్రవారం సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ కొనసాగిన బండజాతర

- జాతర ఉత్సవాల్లో పాల్గొన్న మైనంపల్లి హన్మంతరావు



ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారు

సిద్దిపేటరూరల్: శ్రీస్వయంభూ లక్ష్మీనరసింహ స్వామి బండ జాతరలో భాగంగా రెండోరోజు శుక్రవారం బండంతా భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి కళ్యాణ కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మైనంపల్లి హన్మంతరావు దర్శించుకున్నారు. ఆయనను అర్చకులు, కమిటీ సభ్యులు శాస్త్రోక్తంగా స్వాగతించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎంతో ప్రాచుర్యం కలిగిన ఈ ఆలయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మరింత అభివృద్ధి చేసి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మి, సాకి ఆనంద్, ఎల్లంయాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్యగౌడ్, డైరెక్టర్లు, మండల నాయకులు రాములు, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

కొండపాక(గజ్వేల్): కొండపాకలో రెవెన్యూ, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ...హక్కులు బాధ్యతలపై అవగాహన ఉంటే గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయన్నారు. కుల మతాల పేరిట చిన్న చూపులు చూడటం నేరమని చెప్పారు. అంతకు ముందు గ్రామంలో ఎస్సీ ఎస్టీల పట్ల ఎవరైనా వివక్ష చూపుతున్నారా? హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతులు కొనసాగుతున్నాయా? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీపీవో రమణమూర్తి, పంచాయితీ కార్యదర్శి నరేశ్,నాయకులు సురేందర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'పెట్స్' సంరక్షణ మనందరి బాధ్యత

డాక్టర్ వెంకట్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: పెంపుడు జంతువులు, వన్యప్రాణులు, వ్యవసాయ జంతువులను సంరక్షణ చేయడం మనందరి బాధ్యతని డాక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం పోలీసులకు జంతు సంరక్షణ చట్టాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పెంపుడు జంతువులను రవాణ చేసేటప్పుడు ఎనిమల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రవాణ అనుమతి తప్పకుండా ఉండాలన్నారు. సీపీ అనురాధ మాట్లాడుతూ...కమిషనరేట్ పరిధిలో ప్రతీ వారం జరిగే సంతలలో పోలీసు అధికారుల నిఘా ఉంచాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ భగవన్నామస్మరణతోనే ప్రశాంతత

గజ్వేల్‌రూరల్: భగవన్నామ స్మరణతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు పేర్కొన్నారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శృంగేరీపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం హరిహర లిఖితయజ్ఞాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సిద్ది భిక్షపతి, ఎర్రం శ్రీనివాస్, దూబకుంట మైత్రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ మద్యం తాగి నడిపితే చర్యలు

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 12 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ముందు హాజరు పరచగా విచారణ అనంతరం 12మందికి రూ.9,200 జరిమానా విధించినట్లు తెలిపారు.

◆ నీటి శుద్ధీకరణ యంత్రం వితరణ

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రానికి బరోడా బ్యాంకు తరఫున నీటి శుద్ధీకరణ యంత్రాన్ని బహూకరించారు. బ్రాంచ్ మేనేజర్ దీప్తికతో పాటు సిబ్బంది సాయికుమార్, శ్రీపాద్, రాకేశ్, కిషన్‌తో కలసి శుక్రవారం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతికి అందజేశారు.

◆ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

దుబ్బాకటౌన్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో సైతం రాణించాలని మాజీ కౌన్సిలర్ దేవలక్ష్మీ పేర్కొన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆమె అమ్మ గాలవ్వ, మామ అంజిరెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంజీవరెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులున్నారు.

◆ రోడ్డు పనులకు 6.12 కోట్లు మంజూరు

చేర్యాల (సిద్దిపేట): మండల పరిధిలోని తాడూరు క్రాస్ రోడ్డు నుంచి తాడూరు, చిట్యాల గ్రామాల మీదుగా కమలాయపల్లి వరకు 9.7 కిలో మీటర్ల బీటీ రోడ్డు రెన్యూవల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.6.12 కోట్ల మంజూరు చేస్తూ శుక్రవారం జీవో విడుదల చేసింది.

◆ బీస్మాట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీకి సన్మానం

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని దుద్దెడ శివారులో గల హరితా హోటల్ వద్ద రాష్ట్ర బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సంఘం (బీస్మాట్) జనరల్ కార్యదర్శి జగ్గు మల్లారెడ్డిని శుక్రవారం మండల విద్యాసంస్థల నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మిద్దె రమేశ్, మండల అధ్యక్షుడు సంతోశ్, సభ్యులు ఎజాస్ అహ్మద్, ధన్‌గర్ తదితరులు పాల్గొన్నారు.